


# కపటనాటకం

రచన: జి కె మూర్తి

బస్సు ప్రయాణీకులతో క్రిక్కిరిసిగా వుంది.

తనకెదురుగా నిలబడి వున్న యువకుడిని ఒక్కసారి చూసింది నిర్మల. సిమ్మెంటు కలర్ గాంబర్డీన్ ప్యాంటులోకి తెల్లటి షర్టు టక్ చేసుకున్నాడు. డార్క్ బ్లూ నెక్‌టై మెడలో విలాసంగా వేళ్లాడుతూంది. నిగనిగలాడే నల్లటి బూట్లు, వీటితో ఎంతో ఠీవిగా, అందంగా వున్నాడు. నిర్మల అతనికేసి రెప్పార్పకుండా చూసి, అతడూ తనని చూస్తుండటం గమనించి, చప్పున తల వాల్చేసుకుంది. అతను కూడా చిన్నగా నవ్వుతూ తల ప్రక్కకి తిప్పాడు.

నిర్మల చాలా సేపటినుంచీ గమనిస్తూంది. ఆ యువకుడు కోఠీ దగ్గర బస్సు ఎక్కాడు. స్థళం లేనందువల్ల స్ట్రాపుని పట్టుకొని నిల్చుకోవల్సివచ్చింది. బస్సు ఎక్కినది మొదలు, తనని అదేపనిగా చూస్తూండటం తను గమనించక పోలేదు.

తన వైపు అలా ఎందుకు చూస్తున్నట్టు? అని ఎన్నోసార్లు తనలో తనే ప్రశ్నించుకొంది. తను అతన్ని ఆకర్షించిందా? ఈ తలపుకి ఆమె వళ్లు అవమానంతోనూ, లజ్జతోనూ కుంచించుకుపోయింది. ఆమె మనస్సు చాలా బాధపడింది. భగవంతుడు తనకు అన్నీ యిచ్చాడు కానీ, ఒక్కటిమాత్రం యివ్వలేదు. అది అన్నిటికంటే స్త్రీలకి ప్రధానమైన అందం. ఈ విషయం తనకి గుర్తుకి వచ్చినప్పుడల్లా కళ్ళల్లోకి నీళ్లు తిరిగేవి. అందమైన ఆడవాళ్లని చూస్తే తన మనస్సు అసూయతో రగుల్కొనేది, సరదాగా నవ్వుతూ పోతున్న యువతీ యువకుల జంటలను తను రెప్పార్పకుండా చూసేది. తనూ అలాగే నవ్వుతూ ఉషారుగా తిరగాలనిపించేది, తన హృదయం పురుష స్నేహాన్ని కాంక్షించేది. కానీ....తనని చూసి తన స్నేహాన్ని ఏ పురుషుడూ అర్థించలేక పొయ్యాడు. తన రూపం ఎవ్వర్నీ ఆకర్షించలేక సరిగదా. పై పెచ్చు వాళ్ళల్లో అసహ్యభావాన్ని కల్గించేది. తనని అందరూ చీడపురుగును చూచినట్టు అసహ్యించుకుంటారు. సృష్టికర్త బ్రహ్మను ఎన్నిసార్లో తూలనాడింది. నల్లటి శరీరచ్ఛాయ, చప్పి దవడలు, స్ఫోటకం మచ్చలు, భయంకరంగా వుండే మిడిగ్రుడ్లు, వాటిపైన డళసరైన కళ్లజోడు — వీటిని చూడాల్సి వస్తుందని అద్దంలో మొఖం చూచుకొనేందుకు కూడా భయపడేది. అటువంటిది, తన్ను యీ యువకుడు ఎందుకు చూస్తున్నట్టు? తనని ఏ పురుషుడూ ఆశించడని తనకి బాగా తెల్సు. అందువల్లనే, తన యిచ్ఛల్ని బలవంతంగా చంపుకోవాల్సి వచ్చింది. బస్సు రద్దీవల్ల తల ఎటువైపూ తిప్పేందుకు వీలులేకపోవటంవల్ల తను అపోహపడుతున్నదని సమాధానపడింది. అయితే, తన వైపు చిరునవ్వులు ఎందుకు విసురుతున్నట్టు?

బస్సు ఏదో స్టేజీలో ఆగింది. జనం ఒకళ్ల పై ఒకళ్లు పడ్డారు.

నిర్మల కాళ్లదగ్గర నిలుచున్న యువకుడు ఆ కుదుపుకి తూలి కొంచెంగా నిర్మలమీద పడ్డాడు.



"సారీ"అన్నాడు యువకుడు సిగ్గుపడుతూ.

"నో! నో!! నెవర్‌మైండ్!" అంది నిర్మల, ఒళ్ళు ఎందుకో పులకరించింది. అలా నమయ స్ఫూర్తిగా ఒక అందమైన యువకునితో మాట్లాడినందుకు నిర్మల ఎంతో ఉప్పొంగి పోయింది.

యువకుడు మళ్లీ చిరునవ్వు విసిరాడు. ఈ తడవ అతని దానిమ్మ గింజలవంటి పలు వరుసను చూడగలిగింది. ఆ యువకుడు తన కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూస్తున్నాడు. చప్పున తల దించేసుకుంది.

నిర్మల ప్రక్కనే కూర్చున్న ఒక పెద్ద ముత్తయిదువు ఆ యువకునివైపు అదో విధంగా చూచింది. నిర్మలవైపు అప్రయత్నంగా చూచిన మరో యువకుడు, నవ్వుతూ తల త్రిప్పేసుకున్నాడు ఒక చేత్తో కళ్లు మూసుకుంటూ. ఇది గమనించిన నిర్మల కృంగి పోయింది అవమాన భారంతో.

"నారాయణ గూడా" అన్న కండక్టర్ కేకతో మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చింది నిర్మల. తను దిగాల్సిన స్టేజి వచ్చింది. తన ముందున్న యువకుడుకూడా దిగాడు నిర్మల మరింత ఆశ్చర్యపోయింది. తనని అనుసరిస్తున్నాడా? "ఏమో? అతను వుండేది కూడా నారాయణగూడానేమో!" అనుకుంది.

"మేడమ్"

వెనుదిరిగి చూచింది నిర్మల. యువకుడు చిన్నగా నవ్వుతూ పెద్ద పెద్ద అంగలతో వడి వడిగా తనవేపు నడుస్తున్నాడు.

"ఈ హేండ్ కర్చీఫ్...."

"అవును, నాదేనండీ, బస్సు దిగే కంగారులో మరిచిపొయ్యాను. చాలా థ్యాంక్స్!"

తర్వాత ఏమి మాట్లాడాలో నిర్మలకి బోధ పడలేదు. యువకుడు మాత్రం తనని అనుసరిస్తున్నాడు.

"మిమ్మల్ని ఎక్కడో చూచినట్టు వుందండీ!"

దీనికి ఏమి సమాధానం చెప్పాలో నిర్మలకి అర్థం కాలేదు. ఏమీ మాటలాడకపోవడం నభ్యతగా వుండదనుకొంది. అదీ గాక తన మనసు ఆ యువకునితో మాట్లాడాలని ఉవ్విళ్లూరుతోంది.

"మాది గుంటూరండీ" అంది నెమ్మదిగా.

"అలా చెప్పండి! మిమ్మల్ని బస్‌లో చూచి నప్పటినుంచి ఈ విషయమై బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాను. నన్ను మీరు ఎప్పుడైనా గుంటూర్లో చూచారా."

"ఊఁహూ! లేదండీ అంది నిర్మల. కాసే పాగి "మీదీ గుంటూరేనా" అని ప్రశ్నించింది.

"అబ్బే! కాదండీ! మాది నెల్లూరండీ! కానీ తరచూ గుంటూరు వెళ్ళుతూంటాను. అక్కడ మా ఫ్రెండ్సు చాలామంది వున్నారు లెండి."

"ఓహో! మీరు...."

"నా పేరు శ్రీహరి అండీ, నేను సెక్రటేరియట్ హోమ్ డిపార్టుమెంటులో అప్పర్ డివిజన్ క్లర్కుగా వుంటున్నాను లెండి. మరి మీరు...."

"నేను హైకోర్టులో స్టెనోగా వుంటున్నానండి. ఇక్కడే రూమ్ తీసుకొని వుంటున్నాను."

"ఇంతకూ మీ పేరు చెప్పారు కాదు"

చిరునవ్వు చిలుకరించాడు శ్రీహరి.

"నన్ను నిర్మల అంటారండీ! మిరు రూమ్ ఎక్కడ తీసుకొన్నారు?"

"అబ్బ! ఈ వూళ్లో అదేనండి చిక్కు. ఎన్ని రూములో మారాను. ఒక్కటీ నచ్చలేదండీ. ప్రస్తుతం మా ఫ్రెండు రూములో నాంపల్లి దగ్గర వుంటున్నాను. వాడుకూడ త్వరలో ఫామిలీ తెస్తున్నాడు. తర్వాత నాగతేం కావాలో అగమ్యగోచరంగా వుంది" దిగులుగా మొహం పెట్టాడు శ్రీహరి.

నిర్మల "ప్రస్తుతం నేను ఒక్కదాన్నే వుంటున్నాను. రెండు రూములున్నాయ్. మీకేమీ అభ్యంతరం లేకపోతే అందులో ఒక రూములో వుండవచ్చు."

శ్రీహరి కళ్ళు మెరిసాయి.

"చాలా థ్యాంక్సండీ! మా ఫ్రెండు ఫామిలీ వచ్చింతర్వాత నేను మీ రూమ్‌కి షిఫ్ట్ అవుతాను."

"ఓస్! దానికేం ఫర్వాలేదు లెండి" మందహాసం చేసింది నిర్మల.

"రండి! కాస్త టీ తాగివద్దాం" అంటూ శ్రీహరి ప్రక్కనే వున్న హోటల్‌లోకి దారితీశాడు.

నిర్మల అతన్ని అనుసరించింది. ఇద్దరూ ప్రత్యేకంగా వున్న ఫామిలీ రూమ్‌లోకి వెళ్లారు. బిస్కట్లు, టీకి ఆర్డరు యిచ్చారు.

టీ చప్పరిస్తూ శ్రీహరి అన్నాడు:

"అసలు నాకు సినిమా ప్రోగ్రాం వుందండీ! దీపక్‌లో "బస్ స్టాప్" ఈ దినం లాస్ట్ డే."

నిర్మల ఉత్సాహం కనపరిచింది.

"శ్రీహరి మీకేమీ అభ్యంతరం లేకపోతే, మీరూ నాతో కూడా సినిమాకు రండి. ఒక్కడినే చూడాలంటే నాకు బోరింగ్‌గా వుంటుంది" అన్నాడు.

"అబ్బే, నాకేమీ అభ్యంతరం లేదండీ! నాకూ ప్రత్యేకించి యిప్పుడేమీ పనిలేదు" అంది నిర్మల. తనని ఏ పురుషుడూ ఈ విధంగా సినిమాలకు, షికార్లకు ఆహ్వానించిన పాపాన పోలేదు. కారణం తనకి తెల్సు. వాళ్లతో తిరిగేంత అర్హత తనకు అందంలో లేదు. శ్రీహరి అంతటి అందగాడు, తనతో యీ విధంగా ఆదరంగా మాట్లాడి, అభిమానం చూపిస్తున్నందుకు తన హృదయం ఉప్పొంగింది.

నిర్మల ఎంత వారించినా బిల్లు శ్రీహరే చెల్లించాడు.

సినిమా హాలుదగ్గర చాలామంది జనం వున్నారు. శ్రీహరి గబగబా కౌంటర్ దగ్గరికి వెళ్లి రెండు బాక్స్ టికట్లు తీసుకొచ్చాడు. నిర్మల చాలా బాధ పడింది.

"ప్రతిసారీ డబ్బు మీరే ఇస్తున్నారు ఇదేం బాగాలేదండి."

"పర్వాలేదు లెండి"

శ్రీహరి, నిర్మల హాల్లోకి ప్రవేశించారు. అప్పటికే సినిమా బిగిన్ చేశారు. ఇద్దరూ కుర్చీలో ఆసీనులయ్యారు. నిర్మల సినిమా చూస్తున్నా మనస్సంతా శ్రీహరిమీదనే వుంది. పదేపదే అతన్ని ఆ చీకట్లోనే చూచుకొని మురిసి పోయింది.

శ్రీహరి చెయ్యి నిర్మల భుజంమీద పడింది. నిర్మల ఏమీ అడ్డు చెప్పలేదు.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" శ్రీహరి, నిర్మల చెవిలో చిన్నగా అన్నాడు. నిర్మల తన్ను తాను మరిచిపోయింది.

ఈ దినం ఎంత సుదినం? తన జీవితంలో ఈ దినం మరచిపోలేదు. శ్రీహరివంటి అందమయిన యువకునితో స్నేహమయింది.

ఇన్నాళ్లూ బలవంతంగా అణుచుకొన్న వాంఛలు మళ్లీ తలలెత్తాయి. విశాలమైన అతని వక్షస్థలంమీద వాలిపోవాలనిపించింది. బలమైన అతని బాహువుల్లో నలిగిపోవాలని పించింది. అనుకోకుండా లభించిన ఈ అవకాశాన్ని జారవిడుచుకో కూడదు అనుకొంది నిర్మల.

సినిమా అయిపోయింది హాలు బయటకు వచ్చారు నిర్మలా, శ్రీహరి.

నిర్మలకి శ్రీహరి తనని విడిచిపోతాడేమో నని భయమేసింది.

"పదండి! మీరు ఒక్కరే రూముకు ఈ చీకట్లో వెళ్లలేరు. మీ రూమ్‌దగ్గర దిగబెడతాను. అదీగాక నేనూ మీ రూము చూచినట్టవుతుంది" అన్నాడు శ్రీహరి.

నిర్మల మనస్సు ఎంతో తేలికపడింది. భోజనంచేసి హోటలునుంచి బయటపడి, కిళ్లీలు నమిలి, నిర్మల రూము చేరేసరికి పదకొండు గంటలయింది.

"అలా కూర్చోండి" అంటూ కుర్చీని చూపింది నిర్మల.

శ్రీహరి చిరునవ్వు నవ్వుతూ కుర్చీలో ఆసీనుడయ్యాడు.

"మీరు మాత్రం యింత రాత్రివేళప్పుడు మీ రూమ్‌కి ఎలా వెళ్తారులెండి? ఇక్కడే పడుకోండి" అంది నిర్మల.

శ్రీహరి అనుమానిస్తున్నట్టు నాల్గువైపులా చూశాడు.

"మరేం ఫర్వాలేదులెండి. మీరు యిక్కడ పడుకోవచ్చును. ఈ రూము చాలా సెపరేట్‌గా వుంది. ఎవ్వరూ రారు" అంది నిర్మల శ్రీహరి సందేహాన్ని తీరుస్తున్నట్టు.

"ఉండండి, ఒక్క క్షణంలో వస్తాను" అంటూ శ్రీహరి టేబిలుమీద నున్న ఫ్లాస్కు పుచ్చుకొని, నిర్మల వారిస్తున్నా గబగబా బయటికి నడిచాడు.

పదిహేను నిముషాల్లో తిరిగి వచ్చి ఫ్లాస్కు నిర్మలకు అందించాడు.

"కాస్త టీ పుచ్చుకోండి! ప్రాణం తెరపిగా వుంటుంది" అన్నాడు శ్రీహరి.

"మీరు నన్ను యికమీదట 'అండీ' అని సంబోధించనక్కరలేదు. మన మిద్దరమూ యిప్పుడు స్నేహితులం" నవ్వింది నిర్మల.

"అలాగే మొదట టీ పుచ్చుకోండి"

"అదిగోండి! మళ్లీ 'అండీ' అంటున్నారు."

"సారీ! టీ పుచ్చుకో నిర్మలా!"

"మరి మీరు"

"నేను హోటల్లో త్రాగాను."

నిర్మల టీ పుచ్చుకొంది.

నిర్మల మంచంమీద పరుపును పరిచింది. పరుపుమీద మల్లెపువ్వులాంటి దుప్పటి పరిచింది. తలగడమీద తల వాల్చి విలాసంగా పరుపుమీద వాలిపోయింది.

"మరి నేను...." శ్రీహరి అర్ధోక్తిగా అన్నాడు.

"ఇక్కడే" నవ్వింది నిర్మల

శ్రీహరి లైటు ఆర్పేశాడు.

నిర్మల వళ్ళు తేలిపోతోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

నిర్మలకు మెలుకువ వచ్చేసరికి బారెడు ప్రొద్దెక్కింది. శ్రీహరి మెడమీద చేతులు వేయబోయింది, కళ్ళు తెరవకుండానే. కానీ శ్రీహరి అక్కడ లేడు. ఇంత ప్రొద్దున్నే ఎక్కడకి వెళ్లివుంటాడా అని ఆశ్చర్యపోతూ లేచి కూర్చుంది. అప్రయత్నంగా చేతులకేసి చూసుకొంది. గొల్లుమంది నిర్మల. మెడను తడిమి చూచుకొంది. భోరున ఏడ్చింది నిర్మల. పరుగున వెళ్ళి తను ట్రంక్‌లో దాచుకున్న డబ్బు కోసం చూసుకొంది. మొదలు నరికిన చెట్టులా కుప్పకూలిపోయింది.

గాలికి రెపరెపలాడుతూ ఫ్లాస్కుక్రింద ఓ కాగితం కనిపించింది. అది తీసి చదువుకొని వలవలా ఏడ్చింది.

నిర్మలగారికి,

డబ్బు మానవునిచేత ఎటువంటి పనినయినా చేయిస్తుంది. కేవలం మిమ్మల్ని చూచినంత మాత్రముననే సహించుకోలేని నేను, మీ శరీరాన్ని ఎలా తాకానో అని నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. డబ్బుకోసం చెయ్యక తప్పలేదు.

మీ మేలు నేను ఎన్నటికి మరిచిపోలేను. దాదాపు వెయ్యి రూపాయలు సహాయంచేసిన వాళ్లను మరిచిపోవటం సాధ్యమా? ఎలా మరవగలను చెప్పండి?

అంత త్వరగా మీకు రాత్రి ఎలా నిద్ర పట్టిందా అని మీకు ఆశ్చర్యంగా వుందికదూ? ఏమీలేదు. చాలా సింపిల్! మీరు తాగిన టీలో నిద్రమందు వుంది.

నిస్పృహచెందిన మీ జీవితంలో తాత్కాలికంగానైనా మీరు ఎన్నడూ అనుకోని, ఎవ్వడూ యిచ్చేందుకు సాహసించని సుఖం యిచ్చినందుకు నా మనస్సుకు తృప్తిగావుంది.

ఇక సెలవ్.

ఇట్లు
శ్రీహరి.

(అసలుపేరు కాదని మీరు తెలుసుకునే వుంటారు.)

మళ్లీ ఒక్కసారి భోరున ఏడ్చింది నిర్మల

★


# సిప్పిలినో

దీని సేవవలన తీరునట్టి వ్యాధులు. మేహ పొడలు, మేహ వ్రణం, మేహ వాయువు, మేహ జ్వరం, నలుపు, తెలుపు, ఎరుపు, మేహములు, గ్రంధి, తీట, గుంటపుండ్లు, నయముకాని వ్రణములు, కంఠమాల, తొడలో కలుగునట్టి అరటి పూవువంటి గడ్డలు, తామర, తిమ్మిర వాయువు, మేహ పగుళ్లు, శుక్ల మూత్రము, మధుమేహము ఇటువంటి సకల వ్యాధులను గ్యారంటీగా గుణపరచును. స్త్రీ పురుషులు వాడవచ్చును. 20 పూటలమందు రూ. 3=50 నపై

ధనలక్ష్మి అండ్ కో.,
త. పె. నం. 1376, మద్రాసు-1.